# ఇల్లు

–హోతా పద్మినీదేవి

**భర్తని పరీక్షించి, కనీసం ఒక ఇంజెక్షన్ అయినా ఇవ్వకుండానే వెళ్ళిపోతున్న డాక్టర్ని, ఆందోళన నిండిన ముఖంతో ఆయన్ని అనుసరించి వెళ్తున్న కొడుకుని చూసేప్పటికి గుండె గుభేలుమంది సుభద్రమ్మకి. ఆత్రంగా భర్త దగ్గరకి వెళ్ళి ఆయన్ని పరిశీలనగా చూసింది.**

శంకర్రావు ఊపిరి బలహీనంగా తీస్తున్నాడు. ఆ ఊపిరి తియ్యడమే లేకపోతే ఆయన చచ్చిపోయాడని పొరపాటు పడేవారేమో! సుభద్రమ్మ కళ్ళలో నీళ్ళూ రాయి.

'డాక్టరు మందు ఇవ్వకుండా అలా వెళ్ళిపోయాడేమిటి? రెండు రోజుల నుంచి భర్త మూసిన కన్ను తెరవకుండా పడివున్నాడు. హాస్పటల్‌లో జాయిన్ చెయ్యమని సలహా అయినా ఇవ్వకుండా అలా మాట్లాడకుండా వెళ్ళిపోతాడేమిటి?' ఆవిడ ఆలోచిస్తోంది.

గుమ్మంలో అలికిడికి తలఎత్తింది. నీళ్ళు నిండిన కళ్ళకి లోపలికి వస్తున్న మనుషులు అస్పష్టంగా కనిపిస్తున్నారు. చప్పున కన్నీరు వత్తుకుని కొడుకుని అడిగింది.

''డాక్టరు గారు ఏమంటారురా రామం? పోనీ హాస్పటల్‌లో జాయిన్ చేద్దామా?'' ఆమె అడిగిన దానికి జవాబు రామం నుంచి కాక, ఇంటి యజమాని అహోబలరావు నుంచి వచ్చింది.

''ధైర్యంగా వుండండి అక్కగారూ! ఏం చేస్తాం? దైవలీల అలా వుంది. తిని తిరుగుతున్న మనిషికి క్షణాలలో ముంచుకొచ్చింది'' అని రామం వైపు తిరిగాడు.

''నేను వీధిలోకి వెళ్ళి నలుగురిని పిలుచుకొస్తాను. నాన్నగారిని బయట పడుకోబెడదాం. ఆయన ఇంట్లో గానీ గుటుక్కుమంటే ఇల్లు మైలపడుతుంది'' అంటూనే వీధిలోకి హడావుడిగా వెళ్ళిపోయాడు.

సుభద్రమ్మకి అప్పటికిగాని భర్త పరిస్థితి అర్థమయింది కాదు. ఉప్పెనలా దుఃఖం ముంచుకు రాగా, గోడకేసి తలకొట్టుకుంటూ ఏడవసాగిందావిడ. రామం తల్లిని పొదివి పట్టుకున్నాడు.

వీధిలో నుంచి నలుగురు మనుషులని వెంటపెట్టుకుని వచ్చాడు అహోబలరావు.

శంకర్రావుని వీధిలో రోడ్డుకివతలగా చాప పరిచి పడుకోబెట్టారు. చుట్టూ కర్రలు పాతి పాత దుప్పటి మరుగుగా కట్టారు.

సుభద్రమ్మ ఏడుపు ఆ వీధిలో చాలా మందిని అక్కడికి లాక్కుని వచ్చింది.

'అయ్యో! ఇంకా ప్రాణం వుండగానే బయట పడుకోబెట్టారా?' కామేశ్వరమ్మ బుగ్గలు నొక్కుకుంది.

''వాన రాకడ, ప్రాణం పోకడ ఎవరికి తెలుస్తుంది?'' విష్ణుశర్మ వ్యాఖ్యానం.

''స్వంత ఇల్లులేని వాళ్ళ గతి ఇంతేనమ్మా! ఇల్లు మైలపడితే ఇల్లు అద్దెకిచ్చిన యజమాని వూరుకుంటాడా?''

''మరే! డాక్టరు ఇంక గంటో, రెండు గంటలో అని చెప్పేశాడుట!''

''మీ వాళ్ళకి టెలిగ్రాములిచ్చావా బాబూ!'' శేఖరం గారడిగారు.

అప్పుడు స్ఫురించింది రామానికి. విశాఖపట్నంలో వుంటున్న తన బాబాయికి టెలిగ్రామ్ ఇవ్వవలసిందని.

కదలబోతున్న అతన్ని ఆపాడు అహోబలరావు.

''టెలిగ్రామ్ నేను ఇస్తాను కాని, నువ్విక్కడ నుంచి కదలకు. ఏమో! ఏ క్షణంలో ఏమవుతుందో?''

రామం ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. ఆయన అతనిచ్చిన అడ్రస్ వ్రాసివున్న కాగితాన్ని, డబ్బుని తీసుకుని పోస్టాఫీసుకి వెళ్ళాడు.

పగలు గడిచి రాత్రయింది. శంకర్రావు ప్రాణం శరీరాన్ని విడిచిపోలేక కొట్టుమిట్టాడుతోంది. మూడు రోజులు గడిచాయి. భర్త పక్కనే ఏడుస్తూ కూర్చున్న సుభద్రమ్మ అంది.

''పోనీ, ఇంట్లో పడుకోబెడదాంరా రామం! ఇక్కడన్నీ దోమలు! ఆయన శరీరంలోని రక్తాన్ని దోమలే తాగేస్తున్నాయి. ఆఖరి క్షణాలు సమీపించాయని తెలియగానే బయటికి తీసుకొద్దాం!''

రామంవెళ్ళి తల్లిమాటలని యథాతథంగా అహోబలరావుకి చెప్పాడు.

వినకూడని మాట విన్నట్టు ఇంతెత్తున ఎగిరాడు ఆయన.

''ఇవాళ నక్షత్రం మంచిది కాదు. డాక్టరు ఆశ వదులుకోమని చెప్పిన మనిషిని నా ఇంట్లో పడుకోబెడతారా? ఏ అర్థరాత్రో ఆయన గుటుక్కుమంటే ఇల్లు మైలపడదా?''

రామం మారు మాట్లాడకుండా ఇవతలికి వచ్చాడు.

''పోనీ, మీ అన్నయ్యని వైజాగ్ తీసుకెళ్ళిపోదామా?'' మరిదిని అడిగింది సుభద్రమ్మ.

''ఎందుకు వదినా? చచ్చిపోయే మనిషికి వైజాగ్ అయినా ఒకటే, విజయవాడ అయినా ఒకటే! ఎక్కడైనా మట్టే'' విరక్తిగా అన్నాడు నారాయణ.

సుభద్రమ్మ ఆలోచన వేరు. నారాయణకి వైజాగ్‌లో స్వంత ఇల్లు వుంది. అన్నగారు ఇంట్లో పోయినా అభ్యంతరపెట్టడని ఆవిడ ఆలోచన. తన ఆలోచనని ఎలా చెప్పాలో ఆవిడకి అర్థం కాలేదు.

మరో రోజు గడిచింది. నాలుగు రోజుల నుంచి సుభద్రమ్మ స్పృహ లేకుండా వున్న భర్త ముఖంపై ముసురుతున్న ఈగలని, నిర్దయగా ఆయన శరీరంలోని రక్తాన్ని పీలుస్తున్న దోమలని తోలుతూ అలాగే కూర్చుంది.

అయిదవ రోజు మధ్యాహ్నం శంకరరావు శరీరంలో కొట్టుమిట్టాడుతున్న ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయింది.

మూడవ రోజు నారాయణ, అతని భార్య రామాన్ని, సుభద్రమ్మని తీసుకుని వైజాగ్‌కి ప్రయాణమయ్యారు.

నిస్తేజంగా నీళ్ళు నిండిన కళ్ళతో కూర్చున్న సుభద్రమ్మకి ఎదురుగా కూర్చున్న మరిది, తోడికోడలు అతి మెల్లిగా మాట్లాడుకుంటున్న మాటలు! ఎవరి గురించో తెలుసుకోవాలనే కుతూహలం కూడా లేదు.

స్టేషన్‌లో నుంచి బయటికి వచ్చి నారాయణ ఆటోలు మాట్లాడాడు. ఒక ఆటోలో నారాయణ, రామం ఎక్కారు. సుభద్రమ్మ తోడికోడలు ఎక్కిన ఆటో వైపు నడవబోతూంటే నారాయణ ఆవిడని పిలిచి తను ఎక్కిన ఆటోలో ఎక్కమన్నాడు.

కొడుకు ప్రక్కనే కూర్చున్న ఆవిడ ఆటో ఒక సత్రం ముందు ఆగడంతో అయోమయంగా చూసింది.

''దిగు వదినా!'' అన్నాడు నారాయణ. అక్కడికెందుకు తీసుకు వచ్చాడో అర్థంకాకపోయినా దిగింది.


''ఇక్కడ వుండండి వదినా! నేను ఇంటి నుంచి కాఫీ, భోజనం తీసుకొస్తాను'' అని ఆవిడ మరో మాట మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా ముందుకి నడిచాడు.

సుభద్రమ్మ నోట మాట రానట్టు చూస్తోంది. నారాయణ అక్కడ నుంచి వెళ్ళాక కాని ఆవిడకి అతను చెప్పినది అర్థం కాలేదు. తమని అతని ఇంటికి తీసుకు వెళ్ళడం ఇష్టం లేకనే సత్రంలో వుంచాడతను అనే

విషయం అర్థమై ఆవిడ రోదించసాగింది.

ఏడుస్తున్న తల్లిని అసహాయంగా చూస్తూండి పోయాడు రామం.

''మీకు వైజాగ్‌లో స్వంత ఇల్లు వుంది కాబట్టి కష్టంలో వున్న మీ వదిన గారిని మీ ఇంటికి తీసుకెళ్ళి



మీ అన్నగారి కర్మకాండలని జరిపించడం మీ బాధ్యత'' అని పినతండ్రితో ఇరుగుపొరుగు వాళ్ళు చెప్పడం గుర్తుకు వచ్చిందతనికి. తమని తన ఇంటికి తీసుకెళ్ళడం ఆయనకి ఇష్టం లేదు. కాని ఆ విషయాన్ని చెప్పి తన అయిష్టతని ప్రకటించలేదు. ఊరి వాళ్ళ ముందు తన ఔదార్యాన్ని చాటుకుంటూ తమని తనతో తీసుకొచ్చాడు. రామం పెదవులపై చిత్రమైన నవ్వు కదలాడింది.

పినతండ్రి తమని తన ఇంటికి తీసుకు వెళ్తే ఆయన ఇల్లు మైలపడుతుందనే శంకతో తమని సత్రంలో వుంచాడు. నలుగురూ ఏమైనా అనుకుంటారనే భయంతో ఆయన తమని ఇక్కడికి తీసుకొచ్చాడు తప్ప చచ్చిపోయిన అన్నగారిపై గౌరవంతోనో, వదిన గారిపై అభిమానంతోనో కాదు.

మరిది తమని తనింట్లో వుంచుకుని భర్త కర్మకాండలని జరిపిస్తాడని ఆశ పడ్డ సుభద్రమ్మకి అతను తమని సత్రంలో వుంచడం ఆశని పాతమైంది.

''ఆ ఇల్లు అతని స్వంతం! తన భర్తది కాదు కదా!'' అలా అనుకున్న ఆవిడకి దుఃఖం ముంచుకొచ్చింది.

పది రోజుల తరువాత స్వంత ఊరికి ప్రయాణమైన సుభద్రమ్మ దారిలో కొడుకుతో చెప్పింది.

''రామం! మనం ఇల్లు కట్టుకోవాలిరా!'' ఏదో ఆలోచిస్తున్న అతను ఉలిక్కిపడి తల్లి వైపు చూశాడు.

''ఏ మనిషికైనా 'నాది' అనే ఇల్లు చాలా అవసరంరా రామం! ఎందుకో తెలుసా? అంతిమ క్షణాలలో వున్న ఏ మనిషైనా తన ఇంట్లో ప్రశాంతంగా, తృప్తిగా కన్ను ముయ్యడానికి. బ్రతికి వుండగానే రోడ్డు పక్కన అనాధ శవంలా పడి వుండి అర గంటలోనో, గంటలోనో చావబోయే ఆ మనిషి రక్తాన్ని దోమలు పీలుస్తుంటే ఆ మనిషి ఎప్పుడు చచ్చిపోతాడా అని ఇంట్లో వాళ్ళంతా ఎదురు చూడకుండా వుండేందుకు.''

రామానికి తల్లి తన తండ్రిని దృష్టిలో వుంచుకునే ఆ మాటలు చెబుతోందని తెలుసు.

❀❀❀

''మనం ఇల్లు కట్టుకోవాలిరా రామం!'' సుభద్రమ్మ అలా అనగానే అతను విస్తుపోతూ ఆవిడకేసి చూశాడు.

తండ్రి చనిపోయిన పన్నెండవ నాడే తల్లి ఆ ప్రస్తావన తెచ్చినా ఆవిడ ఏదో బాధలో ఆ మాటలు అంటోందనుకున్నాడే కాని, అవి ఆవిడ మనసులోని దృఢ సంకల్పం నుంచి ఉద్భవించాయనుకోలేదు.

''ఎలా అమ్మా? నా జీతంతో ఇల్లు గడవడమే కష్టమయిపోతోంది. ఇల్లు కట్టడమంటే మాటలా?''

జవాబుగా పెట్టెలో నుంచి మంగళ సూత్రాలను తీసి అందించిందావిడ. రామానికి తండ్రి గుర్తుకు



## 'ఎర' వీనా టాండన్

***'నీ** చిరునవ్వు చాలే! చిత్తయి పోతానే!' అంటారు రవీనా నవ్వు చూసిన వాళ్లెవ్వరైనా సరే. సెట్లో రవీనా ఉన్నప్పుడు ఎవరినైనా అడగండి. ఒకే సమాధానం- అంత అందగత్తె మరొకరు లేరు- అనే! ప్రస్తుతం శ్రీనివాస్, శూల్, జంగ్ సినిమాలుకాకుండా రాకేష్ మెహ్రా, అమితాబ్, అర్జున్ బాజ్‌పాయ్‌లతో తీస్తున్న చిత్రాలు చెప్పుకోదగ్గవి. ఈమధ్య రవీనా గూర్చి మాజీ ప్రేమికుడు అక్షయ్ అవాకులు చెవాకులు పేలాడట. అదేంటమ్మడూ నీ మాజీ అలా నోరు పారేసుకున్నాడు? అనడిగితే – రెండేళ్లయింది మేం వేరుపడి! (పెళ్లీలేదు, గిల్లీ లేదు, మరి ఈ విడిపోవడం ఏమిటో) ఇక నాగురించి మాట్లాడే హక్కు అతని కెక్కడుంది? అంది. అక్షయ్ మాత్రం – 'నన్నూ, శిల్పానీ వేరు చేయాలని చూస్తోంది టక్కరి రవీనా, వా...' అని ఒకటే వాపోతున్నాడుట (సన్నిహితుల వ్యాఖ్య)*

వచ్చాడు.

ఎంత అవసరం వచ్చినా వాటిని మాత్రం తాకట్టు పెట్టడానికి అంగీకరించేవాడు కాడాయన.

''ఊరి బయట ఇళ్ళ స్థలాలు చవగా అమ్ముతున్నారట. మన పక్కింటి మేస్టారు కొన్నారు. ఆయన కొన్న స్థలం ప్రక్కనే మరో స్థలం అమ్మకానికి వుందిట మనకి కొను''.

''కాని, ఇల్లు కట్టాలంటే చాలా డబ్బు కావాలి'' రామం నసుగుతూ అన్నాడు.

''చూద్దాం! భగవంతుడే ఏదో దారి చూపిస్తాడు. నేనూ ఏదో ఒక పని చేస్తాను. ఖాళీగా కూర్చుంటే పిచ్చి ఆలోచనలు వస్తున్నాయి!''

అనడమే కాదు తన ఆలోచనని ఆచరణలో పెట్టింది. ఊరగాయలు, అప్పడాలు పెట్టి అమ్మేది. విస్తళ్ళు కుట్టేది. సుభద్రమ్మ మనసులో 'స్వంత ఇల్లు' అనే ఆలోచన ఏ ముహూర్తాన కలిగిందో రామానికి ప్రమోషన్ వచ్చి జీతం పెరిగింది. అయిదేళ్ళ తరువాత రామం ఇల్లు కట్టి తల్లి కోరికను తీర్చగలిగాడు.

❀ ❀ ❀

మరునాడు గృహప్రవేశం. ఇల్లంతా బంధువులతో సందడిగా వుంది. సుభద్రమ్మ కష్టాలలో ఉన్నప్పుడు ఆమెని పలుకరించిన మాత్రానికే ఆమె బరువు బాధ్యతలని ఎక్కడ వహించవలసి వస్తుందో అనే భయంతో ముఖం చాటేసిన బంధువులంతా ఇప్పుడు రామం ప్రయోజకుడై ఇల్లు కట్టుకోగానే బంధుత్వాలని గుర్తు చేస్తూ ఆ ఇంటికి వచ్చారు.

సుభద్రమ్మ వంట బ్రాహ్మడికి వంటకి కావలసినవన్నీ అందిస్తోంది.

''అత్తయ్యా! పురోహితుడు వచ్చాడు. రేపు ప్రొద్దుట 8 గంటలకే ముహూర్తం. కనుక ఏడున్నరకంతా సిద్ధంగా వుండాలట'' రామం భార్య సీత చెప్పింది.

''అలాగే! నువ్వు పూజకి కావలసినవన్నీ సిద్ధం చేసుకోమ్మా! ప్రొద్దుట హడావుడిలో మరచిపోతాం'' కోడలి వంక ఆప్యాయంగా చూస్తూ చెప్పిందావిడ.

''అలాగే అత్తయ్యా! మీరు కాస్సేపు విశ్రాంతి తీసుకోండి'' ఇల్లు కట్టడం మొదలు పెట్టినప్పటి నుంచి నిర్విరామంగా ఏదో ఒకటి చేస్తూనే ఉన్నారు. అభిమానంగా అత్తగారి చెయ్యందుకుంటూ అంది సీత.

''రేపు ఈ శుభకార్యం కాస్తా గట్టెక్కిపోతే ఇంక అంతా విశ్రాంతే నమ్మా!'' సుభద్రమ్మ కళ్ళలో తన కల నిజమైన ఆనందం, తృప్తి మెరుస్తున్నాయి.

ఎవరో పిలవడంతో సీత లోపలికి వెళ్ళింది. 'అమ్మా! బియ్యం ఇవ్వండి' గాడిపొయ్యి దగ్గరనుంచి వంట బ్రాహ్మణుడి పిలుపు.

''ఇదిగో వస్తున్నాను.'' ఆవిడ పెద్ద గిన్నె నిండా బియ్యం కొలిచి పెరట్లోకి నడిచింది. గుండెల్లో కలుక్కుమన్న బాధతో ఆవిడ పెరటి మెట్లపై ఒక క్షణం అలాగే నిలబడిపోయింది. బాధని ఉగ్గబట్టుకుంటూ రెండడుగులు ముందుకి వేసింది. ఆవిడ ఒళ్ళంతా చెమటలు దిగ్గారుతున్నాయి. ఎక్కడో ఏదో నరం తెగిం ది. ఆవిడ మరో అడుగు వేసి కుప్పకూలిపోయింది.

''అమ్మగారు పడిపోయారు'' వంట బ్రాహ్మణుడి పిలుపుతో అందరూ గాభరాగా పరిగెట్టి వచ్చారక్కడికి.

రామం గాభరాగా తల్లిని ఒడిలోకి తీసుకుని పిలిచాడు.

'అమ్మా!'

సుభద్రమ్మలో చలనం లేదు.

సీత వీధి చివరవున్న డాక్టరు దగ్గరికి పరిగెట్టింది. ఆయన ఆవిడని పరీక్షించి పెదవి విరిచాడు.

'హాస్పిటల్‌కి తీసుకెళ్దాం డాక్టరు గారూ!'' రామం ఆదుర్దాగా, ఆందోళనగా అన్నాడు.

''ఆవిడ ప్రాణం పోయిందయ్యా! 'మాసివ్ హార్ట్ ఎటాక్' ఇది వరకెప్పుడైనా గుండెనెప్పి వచ్చిందా?'' డాక్టరు అడిగిన దానికి సమాధానం చెప్పే స్థితిలో లేడతను.

'అమ్మా!' తల్లి శవం మీదపడి ఏడుస్తున్నాడు. సుభద్రమ్మ మరణవార్త తెలిసిన ఇరుగుపొరుగు వాళ్ళు అక్కడ గుమికూడారు.

అహోబలరావు వస్తూనే అన్నాడు.

''అబ్బాయ్! ఆవిడని అలా పెరటి గుమ్మంలో నుంచి బయటకి తీసుకొచ్చి వీధిలో పడుకోబెట్టు.''

ఏడుస్తున్న రామం ఉలిక్కిపడ్డాడు. ''తల్లిని రోడ్డు వార పడుకోబెట్టాలా?''

''ఏ మనిషికైనా 'నాది' అనే ఇల్లు చాలా అవసరం రా రామం! ఎందుకో తెలుసా? ప్రశాంతంగా, తృప్తిగా తన ఇంట్లో చావడానికి ఒకప్పుడు తల్లి అన్న మాటలు అతనికి గుర్తుకు వచ్చాయి.

స్వంత ఇంట్లో ప్రశాంతంగా చనిపోవాలని, రోడ్డు పక్కన అనాధ శవంలా తనని పడుకోబెట్టకూడదనే ఆవిడ కోరిక తీర్చడంకోసం తను ఇల్లు కట్టాడు. తనా ఇల్లు ఇటుక, సిమెంటులతో కట్టినా, నిజానికి ఆ ఇల్లు తల్లి ఆవేదనతో కూడిన ఆశతో కట్టబడింది. ఇల్లు కట్టడానికి అమ్మ, అహోరాత్రాలు శ్రమించింది. ఇల్లు కట్టాలనే ఆలోచనకి పునాది అమ్మ! అలాంటి అమ్మని వీధిలో పడుకోబెట్టాలా?

''ఇంకా ఆలోచిస్తావేమిటబ్బాయ్! శవాన్ని వీధిలోకి తీసుకెళ్దాం! ఎవరైనా రండి సాయం పట్టడానికి!'' పిలిచాడు అహోబలరావు.

ముందుకి రాబోతున్న మనుషులని చేతి సైగతో ఆపాడు రామం.

'ఎవరైనా వెళ్ళి టాక్సీని పిలవండి'.

'ఎందుకు?' వింతగా అడిగాడు వరసకి బాబాయ్ అయిన ఒకాయన.

'వెళ్ళి టాక్సీ పిలుచుకురండి' అతనికి తెలియకుండానే అతని స్వరం కరుగ్గా ధ్వనించింది.

''ఆవిడని హాస్పిటల్‌కి తీసుకెళ్ళడమెందుకోయ్! డాక్టర్లేం దేవుళ్ళా?'' సీత తండ్రి అడిగాడు.

''మా అమ్మని తీసుకెళ్ళేది హాస్పిటల్‌కి కాదు. ఆవిడ ఇంటికి.''

''ఏమిటి కొత్త ఇంటికా? గృహప్రవేశం చెయ్యకుండా శవాన్ని ఆ ఇంట్లో పడుకోబెడతావా?''

''ఆ ఇల్లు మా అమ్మకల! ఆ ఇంటికి పునాది మా అమ్మ పట్టుదల! స్వంత ఇంట్లో ప్రశాంతంగా కన్నుముయ్యాలనే ఆవిడ కోరిక నెరవేరలేదు. కనీసం ఆవిడ శవాన్ని రోడ్డు పక్కన పడుకోబెట్టాననే అసంతృప్తి నాకు మిగలకుండా వుండాలనే నేనీనిర్ణయాన్ని తీసుకున్నాను'' స్థిరంగా ధ్వనించింది రామం స్వరం.

అతని నిర్ణయాన్ని బలపరుస్తున్నట్టు సీత అతని చేతిని పట్టుకుంది.